క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

దౌల్తాబాద్: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని సోమవారం పంచాయతీ కార్యదర్శి నిర్మలకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో రెండు మూడు రోజులుగా తాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నామని, మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదన్నారు. వెంటనే తమకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రవి, జనార్దన్, బందెప్ప, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో విద్యార్థుల సత్తా



మొదటిస్థానంలో నిలిచిన సంగెంకుర్దు పాఠశాల విద్యార్థులు

యాలాల: ఎఫ్ఎల్ఎన్ పురస్కారాల్లో భాగంగా శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో సంగెంకుర్దు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో మొదటి స్థానంలో సంగెంకుర్దు, ద్వితీయ స్థానంలో జుంటుపల్లి, తృతీయ స్థానంలో ముద్దాయిపేట పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వీరికి మండల విద్యాధికారి రమేశ్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కరుణాకర్‌రెడ్డి, సతీదేవి, ఉపాధ్యాయులు పరమేష్, రాములు, రవిజోషి, సరళ, సావిత్రమ్మ, శిక్షణ ఫౌండేషన్ మేనేజర్ కాశీనాథ్, సీనియర్ మెంటర్ యాదప్ప, నర్సింహులు, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న తండావాసులు

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రతిఒక్కరూ తమ సహాయాన్ని అందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల నాయకుడు విఠల్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని సాల్వీడ్ తండాలో నిర్మిస్తున్న సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయానికి స్థానికులైన రమేశ్, రవి రూ.21 వేల చొప్పున విరాళం అందించారు. ఈ సందర్భంగా విఠల్‌నాయక్ మాట్లాడుతూ... ప్రజలందరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తోచిన సహాయాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో భరత్, వాసురాం, బాలు, హన్మ్య, పాండు, వెంకటేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో రాగిజావ పంపిణీ



రాగిజావ అందిస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నేత పేరి రాజేందర్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నిర్వహించే సంతకు చుట్టుపక్కల నుంచి భారీగా జనాలు వస్తుంటారు. వేసవిలో వారికి చల్లటి నీటితో పాటు రాగిజావ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది వేసవిలో ఈ కార్యక్రమం కొనసాగించనున్నట్లు తెలిపారు. నాయకులు అశోక్‌నాయిూ, మారుతి, శేఖర్, యాదప్ప, బస్వరాజ్, వెంకటయ్య, రాజు, బిచ్చప్ప, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

27న మన్నెగూడ తైబజార్ వేలం

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడలో ఈ నెల 27న తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మాణిక్యం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మన్నెగూడ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.పది వేలు డిపాజిట్ చేయాలని చెప్పారు. ఏడాది పాటు తైబజార్ వేలం ఉంటుందని పేర్కొన్నారు.

కనుల పండువగా తిరుమంజనం

- ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- తిరుమల తరహాలో ఉత్సవాలు



సుగంధ ద్రవ్యాలు తెస్తున్న ధర్మకర్తలు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ధర్మకర్తలు, ఆలయ అర్చకులు శ్రీకారం చుట్టారు. అలయంలో సోమవారం తిరుమంజన కార్యక్రమం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలు, కుంకుమ, పసుపు, చందనం, కర్పూరం, వటివేరు తదితర వాటితో ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను తిరుమల తరహాలో నిర్వహించడం ఇక్కడి ఆలయ ప్రత్యేకత. తిరుపతి నుంచి వచ్చిన పండితులు వారం రోజుల పాటు ఆలయంలో నిత్య సేవలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. భక్తుల ఇలవేల్పుగా నిలిచిన శ్రీవారి ఉత్సవాలను వేద పండితులు తిరుమల తరహాలో నిర్వహించడం ఇక్కడి ఆచారం. తిరుమల తిరుపతి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలను చేశారు. నిత్యం వాహన సేవలు, నిత్య కైంకర్యాలు, పూజలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ తదితర కార్యక్రమాలను భక్తి పారవశ్యంతో నిర్వహిస్తారు.

కార్యక్రమాల వివరాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున శేష వస్త్రాలను సమర్పిస్తారు. మంగళవారం సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, 26న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేషవాహనం, 27న చిన్న శేషవాహనం, హంసవాహనం, 28న సింహవాహనం, వ్యాళి వాహనం, 29న కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, అమావాస్య పూలంగి సేవ, 30న మోహినీ అవతార ఉత్సవం, ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం, గరుడోత్సవం, లంకా దహనం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శేష వస్త్రాలు సమర్పన, 31న హనుమంత వాహనం, వసంతోత్సవం, గజవాహనం, ఏప్రిల్ 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 2న రథోత్సవం, అశ్వవాహనం వీధి ఉత్సవం, 3న పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



మూల విరాట్

ప్రశాంతంగా పది పరీక్షలు

సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్



తాండూరు రూరల్: మంబాపూర్ పరీక్ష కేంద్రం వద్ద సబ్ కలెక్టర్

తాండూరు రూరల్: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ జెడ్పీహెచ్ఎస్ పరీక్ష కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. తాండూరు సబ్ డివిజన్‌లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా నిర్వహిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి జిల్లా కావడంతో పదో తరగతి పరీక్షలకు సంబంధించి చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

కేంద్రాల పరిశీలన

కొడంగల్ రూరల్: పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్షల తీరును తహసీల్దార్ విజయకుమార్ పరిశీలించారు. కేంద్రాల పరిధిలో పోలీసు బందోబస్తుపై ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.



కొడంగల్ రూరల్: కేంద్రం ఆవరణలో తహసీల్దార్ విజయకుమార్

ఓయూలో కొడంగల్ విద్యార్థుల సందడి



ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ రెడ్యానాయక్‌తో విద్యార్థులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ రెడ్యానాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేచురల్ హిస్టరీ జువాలజీ మ్యూజియంలో కలియ తిరిగారు. ప్రాక్టికల్‌తో విద్యార్థులకు సబ్జెక్టుపై మంచి అవగాహన కలుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర అధ్యాపకులు రమేష్, డి.భరత్‌కుమార్, భౌతిక శాస్త్ర అధ్యాపకురాలు కె.అన్నపూర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం

కొడంగల్: పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. విరాళాలు ప్రకటించిన దాతలు సహకరించాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రవీంద్రయాదవ్, పి.శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతిగౌడ్, కానుకుర్తి నర్సిరెడ్డి కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వచ్చే ఏడాది వరకు ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తేవడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ నిర్మాణంలో భాగంగా విరాళాలు ఇస్తామని చెప్పిన భక్తులు తొందరగా ఇచ్చి సహకరించాలని కోరారు. ప్రస్తుతం గర్భగుడి నిర్మాణ పనులు చివరి దశకు చేరినట్లు చెప్పారు. పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం ఉందన్నారు. యాదాద్రి ఆలయం మాదిరిగా కొడంగల్‌లో అయ్యప్ప స్వామి ఆలయాన్ని కృష్ణ శిలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప స్వామి, కుమార స్వామి, వినాయకుడి ఆలయాల నిర్మాణం పూర్తి అయినట్లు చెప్పారు. ఈ పవిత్ర కార్యంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

ఆశ కార్యకర్తల ముందస్తు అరెస్టు

దౌల్తాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం హైదరాబాద్‌లో కార్యక్రమం తలపెట్టారు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల ఆశ వర్కర్లను నగరానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మండల అధ్యక్షురాలు శశికళ మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులు సరికాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు మంగమ్మ తదితరులు ఉన్నారు.

అర్ధరాత్రి తరలింపు

ధారూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టే ధర్నాకు ఆశ కార్యకర్తలు వెళ్లకుండా ఆదివారం రాత్రి ముందస్తుగా అరెస్టు చేసి ధారూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాత్రి సమయంలో అరెస్టు చేయడంపై ఆశ కార్యకర్తలు మండిపడ్డారు. అక్రమ నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు.



దౌల్తాబాద్: పోలీసుల అదుపులో ఆశ కార్యకర్తలు

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

దౌల్తాబాద్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి అమూల్య పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాలకంటే ఎక్కువ దగ్గు ఉండి, సాయంత్రం వేళ జ్వరం ఉంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలన్నారు. వ్యాధి సోకిన వారికి మందులు అందిస్తారన్నారు. ఆరోగ్యశాఖ సూచనలు పాటిస్తూ క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫీ పాల్గొన్నారు.

ఆడ పిల్లలు ధైర్యంగా ఉండాలి

ఎస్‌ఐ అరుణ్‌కుమార్

నవాబుపేట: ఆడ పిల్లలు ధైర్యంగా ఉండి చదువులో ముందుకు సాగాలని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో బాలికశిశు సాధికారత క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడ పిల్లలు ఎందులో తక్కువ కాదని పేర్కొన్నారు. చిన్నప్పటి నుంచి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, కేజీబీవి ప్రత్యేకాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అడ్డుకోవాలి

మర్పల్లి: నేటి సమాజంలో మానవ అక్రమ రవాణాను ప్రతిఒక్కరూ అడ్డుకోవాలని మర్పల్లి ఎస్‌ఐ సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మండల పరిధిలోని ఆయా గ్రామాల మహిళ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు, స్వచ్ఛంద సంస్థల నాయకులకు మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.



నవాబుపేట: మాట్లాడుతూ ఎస్‌ఐ అరుణ్‌కుమార్

వైద్యం కోసం నిరీక్షణ

సమయపాలన పాటించని వైద్యులు

షాబాద్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోగులు వైద్య సేవల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం 11:30 గంటల వరకు ఒక్క డాక్టర్ కూడా రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. స్టాఫ్ నర్స్ మాత్రమే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రోగులకు వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ



షాబాద్ ఆస్పత్రిలో రోగుల ఎదురుచూపులు

నేడు జీపీ దుకాణాలకు వేలం

ధారూరు: మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో ఉన్న గ్రామ పంచాయతీ దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నామని కార్యదర్శి అంజ్యానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. జీపీ కార్యాలయంలో మూడు దుకాణాలకు వేలం ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.10 వేలు చెల్లించాలని, పంచాయతీలో ఏవైనా బకాయిలు ఉన్న వారు వేలంలో పాల్గొనడానికి అనర్హులని వివరించారు.

నేడు బుగ్గాపూర్‌లో పంటల నమోదు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని బుగ్గాపూర్ గ్రామంలో రబీ పంటల సాగు వివరాలను మంగళవారం నమోదు చేస్తారని ఏఈఓ సందీప్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం తీసుకొచ్చి సాగు చేసిన పంటలను నమోదు చేసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో పంటల వివరాలను ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బంగారంపై రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

తాండూరు రూరల్: బంగారంపై తీసుకున్న రుణాలకు సంబంధించి వినియోగదారులు రెన్యూవల్ చేసుకోవాలని తట్టెపల్లి పీఏసీఎస్ సీఈఓ రాజమౌళి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2020 నుంచి 2025 వరకు 172 మందికి రూ.1.30 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మార్చి 31 వరకు కనీసం వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. లేదంటే బంగారాన్ని జిల్లా సహకార బ్యాంక్‌కు పంపించి వేలం వేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

బంట్వారం: సబ్సిడీ వ్యవసాయ పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోట్‌పల్లి వ్యవసాయశాఖ అధికారి సి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రైతు వేదికలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్యాటరీ స్ప్రేయర్, తైవాన్ స్ప్రేయర్, రోటవేటర్స్, కల్టివేటర్ సబ్సిడీ పరికరాలు కోట్‌పల్లి మండలానికి మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల మహిళా రైతులు దరఖాస్తు ఫారం పూర్తి చేసి పాస్ ఫొటో, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జత చేయాలన్నారు. రోటవేటర్, కల్టివేటర్‌కు సంబంధించి ట్రాక్టర్ ఉన్న మహిళా రైతులు ఆర్సీ వివరాలను జత చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తును వ్యవసాయ అధికారులకు అందజేయాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



పరీక్ష కేంద్రం వద్ద పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ జెడ్పీహెచ్ఎస్ వద్ద పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మహేందర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో పండ్లు, మజ్జిగ ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. మహేందర్‌రెడ్డి యువసేన అధ్యక్షుడు సుదర్శన్‌తో పాటు మరికొందరు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా పండ్లు పంపిణీ చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

పంట నష్ట వివరాలు నివేదిస్తాం

నవాబుపేట ఏఓ జ్యోతి

నవాబుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను అంచనా వేసేందుకు అధికారులు నడుం కట్టారు. సోమవారం పంట నష్ట వివరాలు సేకరించేందుకు ఏఓ జ్యోతి మండలంలో పర్యటించారు. మండల పరిధిలోని ఆర్కతల, మీనపల్లికలాన్, ఎల్లకొండ, ముబారక్‌పూర్ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు రోజులుగా భారీ వర్షాలు కురిశాయన్నారు. నాలుగు గ్రామాల్లో 18 ఎకరాల్లో జొన్న, మూడు ఎకరాల్లో మొక్కజొన్న, 28 ఎకరాల్లో కూరగాయలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. నష్టపోయిన రైతులకు మేలు జరిగేలా జాబితాను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ పవన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్కతలలో పంటలు పరిశీలిస్తున్న అధికారులు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



బంట్వారం: రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచారం వెంకటేశంతో కలిసి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో బంట్వారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం నిర్మాణం కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం పెద్దఎత్తున చేపడుతున్నట్లు పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు యాదగిరి, శాకం నర్సింలు, నాయకులు రాధాకృష్ణగౌడ్, శ్రీకాంత్, ప్రభాకర్, నర్సింలు, రమేశ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

దోమ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఇందిరమ్మ గ్రామ కమిటీ సభ్యుడు ఆశన్నగౌడ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఐనాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ముందుకు వెళ్తుందని, ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు భాస్కర్‌గౌడ్, వెంకటయ్య, రవికుమార్‌గౌడ్, నల్లరాజు, ఎర్రరాములు, వెంకటయ్య, అంజిలయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



దోమ: ఐనాపూర్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

రూ.10 లక్షలతో పనులు

మర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నూతన పంచాయతీలలో అభివృద్ధి పనులు విరివిగా చేస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని రామపూర్ నూతన గ్రామ పంచాయతీలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

సీఐ కాంతారెడ్డి

షాబాద్: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే సహించేది లేదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాంలాల్‌నాయక్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ కాంతారెడ్డి